# రోగి

నేనింకా మజ్జిగా అన్నం ముద్దలు లెక్క పెట్టుకుంటూ తింటూన్నాను. అప్పటికప్పుడే కోటు తగిలించుకుని సావిట్లో తయారయారాయన. "సీతా! ఆ రామారావుకి ప్రొద్దుటనుంచీ స్పృహ లేదు. కాస్త మందో మాకో కావా లేమో కొద్దిగా కనుక్కుంటూండు. అప్పుడే పదీఏభై ఐదు అయింది." అంటూ వీధిలోకి వురికారు.

రామారావుకి మూడురోజుల్నుంచీ జ్వరమొస్తోంది. ప్రతి పూటా డాక్టరు మందుమారుస్తూ మామూలుధోరణిలో "అదే తగ్గుతుంది" అంటున్నాడట. శుక్రవారం ఏదోశలవు. శని వారం పెనల్టిమేట్ సాటర్ డే; ఆదివారం సెలవే కదా! అంచేత మూడురోజుల్నుంచి ఆయనే అతన్ని కనిపెట్టుకు వున్నారు. ఆరోజు సోమవారం అవడంచేతనూ ఆయనకి ఆఫీసు వుండడంచేతనూ ఆ బాధ్యత నానెత్తిన పడింది.

రామారావు మేము అద్దెకున్న యింట్లో వీధిఅరుగుమీద గది పుచ్చుకుని నాలుగునెలలు పైగా అవుతుంది. మొదటి నెలలో చాల సజావుగా వుండేవాడు గాని, రెండోనెలలో నావంక వెకిలి చూపులు ప్రసరించడం ఆరంభించాడు. శాస్త్రిలుగారి కోడలులాటిది అయితే భర్తతో చెప్పి రాద్ధాంతంచేసి అనవసరంగా వూళ్ళోవాళ్ళ నోట్లో పడేదే కాని నేనంత అవివేకిని కాను.

ఒకరోజుసాయంకాలం అతను వీధిఅరుగుమీద నుంచు న్నాడు. నన్నా రకపుచూపులు చాలా బాధ పెడతాయని చెప్పేందుకుగాను మావీధితలుపూ వీధివైపువున్న కిటికీ తలుపులూ పిడుగుపడినంత ధ్వని చేస్తూ లోపల గడియ పెట్టుకున్నాను. కుక్క కాటుకి చెప్పుదెబ్బలా. ఆపురుషుడు ఆరోజునుంచి యీరోజుదాకా నావంక చూస్తే వొట్టు. తర్వాత నేనుకూడా చాలా పస్తాయించాను అతన్ని చాలా Offend చేశానేమోనని.

వుదయం 102 డిగ్రీల జ్వరం వుందని డాక్టరు అన్నా డని అయన చెప్పారు. పొద్దుట్నుంచీ మత్తుగా పరుండి వున్నాడట.

భోజనం త్వరగా ముగించాను. విస్తళ్ల ఎత్తుకోలేదు. నేతిగిన్నె, పెరుగుగిన్నె తీసి అలమారాలో వుంచి వీధి అరుగుమీదికి వెళ్ళాను. అతని గదితలుపు వోరగా వుంది. ఒక్కమారు వీధిలోకి అటూ యిటూ చూశాను. మా సందు నిర్మానుష్యంగా వుంది. తలుపు సందులోంచి చూశాను. అతను పక్కమీద పడుకుని వున్నాడు. ఒకతలుపు పుచ్చు కుని రెండవతలుపు నెమ్మదిగా తోస్తూ లోనప్రవేశించాను.

గదిలో దేశీయనాయకుల ఫొటోలూ, సినీమాస్టార్ల ఫొటోలూ జాస్తీగా వున్నాయి. నాలుగైదు కుర్చీలూ ఒక రైటింగు టేబిలూ, ఒక చిన్న టేబిలూ, నిలువుటద్దపుబీరువా వున్నాయి. చిన్న టేబిలు అతని తలవైపున వుంది. దాని

మీద రోగిగదిలో వుండవలసిన సామగ్రి అంతా వుంది టేబుల్‌మీద పచ్చిద్రాక్షపళ్ళు చీమల్తో చెలిమి చేశాయి. మంచినీళ్ల గ్లాసుమీద మూతలేదు.

అతను కాశ్మీరశాలువా కప్పుకున్నాడు. ఏపూట కాపూట దుప్పటి దులిపి సరిగ్గా పరచకపోవడంచేతనో ముఖమలు దిండ్లకి స్థానభ్రష్టత్వం ప్రాప్తించడం చేతనో భూదేవి ఒక తలగడాని ఆకర్షిస్తోంది. ఈగలు విందుకి ప్రజగూడినట్లు రొజ చేస్తున్నాయి.

నెమ్మది నెమ్మదిగా అడుగులు వేస్తూ అతని మంచం వద్దకి వెళ్ళి నుంచున్నాను. అతను కళ్లు మూసుకునే వున్నాడు. కళ్లు తెరిపికి రాకనో లేక నిద్దర్లో మునిగి వున్నాడో.

“కాస్త కాఫీచేసి యిమ్మన్నారా?” నేను అడిగాను. అతను ఒక్కపర్యాయం కళ్లు తెరిచాడు. నా ముఖాన్ని ఒక్క నిమిషకాలం తదేకదృష్టితో చూశాడు.

పూర్వపుమాదిరి వెకిలిచూపు కాదు. మళ్ళీ కళ్లుమూసేసు కున్నాడు.

దగ్గరలోవున్న ఒక పేముకుర్చీ లాక్కున్నాను. అం దులో ఆసీనురాలనయ్యాను.

మళ్లీ అడిగాను. కాఫీ కావాలా? అంటూ.

మళ్లీ అతని నేత్రద్వయం విప్పారింది. యీమారు నావైపు చూడలేదు. కిటికీవైపు చూశాడు. అపరాహ్ణం

అవవస్తోంది. దెయ్యంపట్టిన వాడిలా లేచి మంచంమీద కూచున్నాడు. నాకు దెయ్యాలంటే భయంలేదు - నమ్మకం అంతకంటే లేదు. అంచేత భయపడవలసిన అగత్యమూ సినీమాతారమాదిరి కెవ్వుమని కేక వేయవలసిన అవసరమూ ఎంతమాత్రం లేకపోయింది.

"కాస్త కాఫీ యిస్తాను."

"ఆ ఆ" అన్నాడు నివ్వెరబోతూ.

"మీరు కలగనడం లేదు. నేను సీతని, మీ స్నేహితుని భార్యని."

"సీ....తా!" అన్నాడు. అంటూ పక్కమీద పడిపోయాడు.

అతను "సీ...తా!" అన్నాడు. అందరూ నన్ను "సీతా" అనడానికీ అతను "సీ-తా" అని వుచ్చరించడానికీ చాల వారవుంది. ఎంతో బేధం వుంది. పట్టుదలతోనూ పశుత్వ ప్రాబల్యంతోనూ అణగారిపోతున్న ప్రపంచం నేను ఫలానా అని నిర్దేశించడానికి "సీతా" అంటారు. కాని అతని వుచ్చారణలో దేవత్వం వుట్టి పడుతోంది. అతను ఒక దివ్యకల కంటున్నాడు. కళ్లు మిరుమిట్లుగొలిపే దివ్యతేజస్సు చూస్తున్నాడు. ముక్తిమార్గానికి నేను టోలుగేటునని తలపోస్తున్నాడనుకుంటాను

"ఏమండీ!"

"ఏమిటి సీతా ?"

మళ్ళీ ఆ "సీ-తా" లో వుండే పూర్వపు మార్దవమంతా వుంది.

"కాఫీ కాచి తీసుకురానా ?"

'దేవుడుచాలా ఉత్తమోత్తముడుసుమా !"

"అవును."

అవుననక మరింకేమంటాను ???

"మానవజీవితానికి ముక్తియివ్వగలిగిన మోక్షప్రదాత దేవుడుసుమా !"

"ఊఁ"

"దేవుడులేడని ఎప్పుడూఅనకు"

"అవును—కాఫీపుచ్చుకోరూ ?"

"యింకాకాఫీఎందుకు !—ఆయినా యియ్యి"

"కాఫీకాచితీసుకువస్తాను" అంటూ కుర్చీలోంచిలేచాను. ఇటుతిరిగి ఒక్కడుగు వేసాను. పైటచెంగు ఏకుర్చీకో పట్టుకుందేమో అనుకున్నాను. తీరా చూద్దునుగదా అతని చేతులోవుంది.

నా శాంతం భస్మీపటలమైపోయింది. ఒక్క సెకను కాలం అతన్ని స్త్రీ లంపటుడుగాను, కాముకుడుగానూ, దుష్టస్వభావుడుగానూ, క్షమార్హతలేని అవినీతిపరుడుగానూ నీచుడుగానూ తలపోశాను. రోగికనక సరిపోయింది.

ఇంకొకడైతే కాలిజోడుకోసం వెతుక్కోవలసివచ్చేది.

ఉగ్రకాళీరూపంతో "ఏంపనియిది ?" అన్నాను.

"సీ—తా !"

మళ్లీ ఆ "సీ—తా"—ఆమొట్టమొదటి"సీ—తా" ఆ"సీతా"తో ఒకమాంత్రికశక్తి వుంది. ఇన్నిసంవత్సరాల వైవాహిక జీవితం గడిపానుగాని నాభర్తకూడ నన్నెప్పుడూ ఆమాదిరిగా సంబోధించలేదు.

అతని మొహంవంక ఒక్కసారిచూశాను. అదే నాజీవితంలో మొట్టమొదటిసారి అతని మొహంలోకి చూడడం. పాలిపోయిన చెక్కిళ్ళు, మాసిపోయిన గెడ్డం, కృశించిపోతున్న శరీరం, పోషణలేని జుట్టు దివ్యకళలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న నేత్రద్వయం— అదీ అతనిస్థితి.

"సీతా, నన్ను కోప్పడకు"

"కోప్పడుతానా ? నాకేంపట్టింది కోప్పడేదాకా !"

"ఈకట్టె కృశిస్తోంది. కృశించి కృశించి నాశనమైపోతుంది. నాఆత్మ వికసిస్తోంది. వికసించి వికసించి పరిపూర్ణత్వాన్ని పొందుతుంది. కట్టె నాశనమైపోగానే ఆత్మ స్వాతంత్రగీతాలు పాడుతుంది."

అతను తీరని మనోవ్యథతో క్రుంగిపోతున్నాడనీ జీవనజ్యోతిలోని తైలం (హరించిపోతూందనీ అతని మాటలే చెప్తున్నాయి.

అలాంటి దీనస్థితిలోవున్న మనిషిని కష్టపెట్టడం, రంపపుకోతతో గాటుపడిపోయిన హృదయాన్ని సుత్తి పుచ్చుకుకొట్టడం. అది ఎంతమాత్రం మనస్కరించలేదు. ఏమీతోచక కుర్చీలో చతికిలబడ్డాను.

"ఎంగిలి విస్తిళ్లన్నా ఎత్తుకోలేదు. ఇప్పుడేవస్తాను" అంటూ లేవబోయాను.

"రావేమో !"

"నామీద అంతమాత్రం నమ్మకంలేదూ ?"

"నేను నిన్ను నమ్మకపోయినా, నువ్వు నన్ను మోసం చేసినా నేను నరకంలోకి పోతాను. స్వర్గం టపీమని మూస్తారు."

భావకవులంటే యీబాపతే కాబోలని వూహించుకుంటూ యింట్లోకి వెళ్లాను. వంటయింట్లోపని పూర్తిచేసుకుని, నిలువుటద్దంముందు నుంచుని వక్కపొడి నములుతూ నన్ను నేను చూచుకుని నవ్వుకుంటూవుండగా సుందరమ్మ పిన్ని రెండోకూతురు వాళ్ళక్క పెద్దమనిషయిందనే శుభ వర్తమానం తెలియచెప్పడానికి వచ్చింది. దానికి నాలుగు పిప్పరమెంటుబిళ్ళలుపెట్టి సాగనంపేటప్పటికి నా పెద్దలు దిగివచ్చారు. వీధితలుపు లోనగడియపెట్టుకొని, మా పడక గదికీ రామారావుగదికీ మధ్యనివున్న తలుపు తెరుచుకొని అతనిగదిలో ప్రవేశించాను. అతనికళ్లు మూతలుపడి వున్నాయి.

"కాఫీ చేసి యివ్వమంటారా ?"

"ఊఁ"

మనిషి చాలా నీరసంగా వున్నాడు. స్టవ్‌మీద పదినిము షాల్లో కాఫీ తయారుచేశాను. వెండిగ్లాసులో కాఫీపోసి అతని దగ్గరికి తీసుకువెళ్ళాను.

"కూచోండి"

అతను మంచంమీద కూచున్నాడు.

కాఫీగ్లాసు అందిచ్చాను. గుక్కెడు గుక్కెడుచొప్పున గ్లాసెడుకాఫీ తాగేశాడు.

"కాఫీ బావుందా ?"

"అమృతం"

నాకు కొద్దిగా నవ్వువచ్చింది.

"ఇంకా స్త కావాలా ?"

"ఉందా ?"

"ఊఁ"

ఫ్లాస్కునిండా పోసివుంచాను. అందులోసగం అతని గ్లాసులో పోశాను. మిగిలినసగమూ నన్ను తాగెయ్య మన్నాడు. తరువాత తాగుతాననీ నాకింకా కాఫీవేళ కాలేదనీ అన్నాను. వినలేదు. పట్టుబట్టాడు. రోగితో వితండవాదన పెట్టుకునేందుకు నామనస్సు వొప్పుకోలేదు.

వేడికాఫీ తాగడంవల్ల రోగికి చెమటపొయ్యడం ఆరం భించింది. నౌకరు ఆరోజున రావడం మానేసినందున వాడి

నాలుగు తిట్టి నన్ను విసనకర్ర తెచ్చిపెట్టమన్నాడు. మా బెడ్ రూములోని ఎలక్ట్రిక్ ఫానుతీసుకువచ్చి, చీమలుపట్టున్న ద్రాక్షపళ్లు కిటికీలోంచి వీధిలోపారేసి ఆ స్థానంలో ఫాన్ ప్రతిష్ఠించాను.

ఫాన్ రివ్వున తిరుగుతోంది. గదిని చల్లటిగాలి ఆవరించింది. నా శిరోజాలు చేతులకి నిష్కారణంగా పని కల్పించడం మొదలెట్టాయి. అతనిప్రాణం హాయిగావుంది.

ఒక్క కాయితంముక్క ఎగిరి ఫాన్‌దగ్గిర పడింది. ఫాన్ దానికిరాచుకుని టపటపధ్వనిచెయ్యడం ఆరభించింది. కుర్చీలో కూచున్నదానిని లేచివెళ్ళి ఫాన్ఆపి, కాగితం దూరంగాపారేశాను. ఫాన్ తిరిగి వదిలాను. అతను నా చెయ్యి పట్టుకున్నాడు. అతనిచెయ్యి జ్వరానికికాబోలు సలసలా కాగుతోంది. యిలామంచంమీద కూచోమన్నాడు. అతనుతీసుకుంటున్న చనువు నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. రోగిమంచంమీదపడుకున్నాడు. నేనతనిపక్కని అతని మంచంమీదనే కూచున్నాను. సంఘనీతి కొద్దిగా భయపెట్టింది. కాని ఎవరుచూస్తారనే సిద్ధాంతం ఆ నీతిని మసిచేసి పారేసింది.

"మీరు మీ పిచ్చి అభిప్రాయాలు మార్చుకోవాలి" అన్నాను పాఠంచెప్పినట్టు.

"ప్రేమ పిచ్చిది."

"నన్ను మీరు ప్రేమించవద్దు. పండులాంటి నా కాప రానికి విఘాతం కలుగుతుంది."

"నేను నిన్ను ప్రేమించడంలేదు. నిన్ను ప్రేమించదానికి నీభర్తకి ఒక్కడికే హక్కువుంది. అతడు నిన్నూ, నీ హృదయాన్నీ త్రికరణశుద్ధిగా ప్రేమించగలిగే ప్రేమమూర్తి. ఇంకోడెవడైనా నిన్ను ప్రేమిస్తున్నాడంటే నీ అవయవముల సొంపూ, నీ చాతుర్యమూ, నీ ముఖవర్చస్సూచూసి మోహపడుతున్నాడన్నమాట. ఆమాదిరివాణ్ణి షూట్ చేసినా పాపంలేదు. వాడు భౌతికానందంకోసం తంటాలుపడే చవటపెద్దమ్మ. ఆత్మానందం వాడికి అర్ధంకాదు."

"ఊఁ" అన్నాను. ఏమీ అనకుండా వూరుకుంటేఎలా ?

"నా ప్రేమదేవత ఛాయ నీలో చూడగలుతున్నాను. నువ్వు ఛాయమాత్రమే !"

ఆవేదాంతం నాకు తెలీదు. యీనాటికూ్కడా తెలీదు. నేను ఛాయని కానేరను; నాకు ఛాయవుందిగాని నేను ఛాయను కాను. ఆ ఛాయామాత్రం అతనికేతెలియాలి—

"మీకు వివాహమైందా ?"

ఆప్రశ్న అతన్ని పూర్ధ్వభాగంవేపు చూసేట్టుచేసింది. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై. అవి చెక్కిళ్ళదాకా జారడం ఆరంభించినై.

అనుకోకుండానే పైటకొంగుతో కన్నీళ్లుతుడిచాను.

నాదేహంమీద వెయ్యితేళ్లు పాకినట్లయింది. అతన్ని తాకుతున్నాను. అతనంటే జాలిపడ్తున్నాను. అతనికిహృదయంలో ఒక సున్నితస్థానం ప్రసాదిస్తున్నాను. అది సాంప్రదాయానికి వ్యతిరేకంగాదూ !

అది సాంప్రదాయధర్మం కాదు. కాకపోయినా మానవత్వం వుంది. జాలిపడేహృదయాన్ని భగవంతుడు నాకు ప్రసాదించాడు. నా భర్తని మోసం చేదామనిగానీ, మా పవిత్ర ప్రేమకి కళంకమాపాదిద్దామనికానీ నాకు తలంపు లేదు. ఇకఅతనా ? జీవితాంబుధిలో సాగుతూన్న సంసార నౌక వొకతుపానుకు విరిగిపోగా విరిగినముక్క నొకదాన్ని సహాయభూతంగాచేసుకుని అలసటతోయీదుతూ యిప్పుడో యింకాసేపటికో మునిగిపోయేందుకు సిద్ధంగా వున్నాడు. అలాంటి మా యిద్దరిమధ్య.........హరి ! హరీ !!

తువ్వాలుతో అతనిమొహం తుడిచాను. మొహంమీద పడుతున్న క్రాపు పైకిదువ్వాను. "జ్వరం దానంతటదే సర్దుకుంటుంది అధైర్యపడకండి" అని సముదాయించాను.

"సీ-తా" అన్నాడు. మళ్లీ ఆ ఎలక్ట్రిక్ "సీ-తా"

ఎలాంటివిప్లవం సంభవిస్తుందోఅని కంగారుపడ్డాను. శాలువలోంచి అతని రెండుచేతులూ రెండుకత్తుల్లా బయటికివచ్చి నా మొహాన్ని అతని మొహంమీదికి తోసినై. ఎదురుగావున్న నిలువుటద్దపు బీరువాలో అతనిమొహమూ

నా మొహమూ జంటగా కనిపించినై. ఆ దృశ్యం భరించ లేకపోయాను.

నా శక్తికొద్దీ అతన్ని కౌడదామనుకొంటూవుండగా. అతనే నన్ను కౌగిలిలోంచివదిలేసి, "సీతా నువ్వు ఛాయవి. నీ స్పర్శవల్ల నాకు సౌఖ్యములేదు. పైగా నీకుమనః క్లేశము"

"పరాయి ఆడదానివిషయంలో యీ ప్రకారం ప్రవర్తిం చడం పెద్దమనిషితరహాకాదు."

మంచంమీదనుంచి లేవబోతూంటే అతనుచెయ్యిగట్టిగా పట్టుకుని కూచోబెట్టాడు. ముళ్ళమీద కూచున్నట్టు కూచు న్నాను.

"నువ్వు నా సీత ఛాయవు."

"మీ సీత ఎవరు ?"

"నా భార్య"

"ఎక్కడవుంది ?"

అతను రెండుగంటలసేపు చెప్పాడు తనభార్యచరిత్ర.

ఏముంది ? దాంపత్యం ఎప్పుడూ ఎడమొహం పెడ మొహం అన్నట్లు వుండేది. ఫిల్ములో యాక్టుచేసేందుకు ఒక జమీందారు కొడుకుతో బెంగుళూరు వుడాయించింది. ఆమె అతన్ని తోటకూరలో పురుగుమాదిరిగా చూసినా అతనుమాత్రం ఆమెని మర్చిపోలేకపోయాడు. నేను ఆమె మాదిరిగా వుంటానట. పేరులోకూడా సమన్వయం కుదిరింది.

ఆ ప్రేమికుడిజీవితం దగ్ధంచేసిన అతనిభార్యని అసహ్యించుకొన్నాను. ఆ విశాలహృదయుడు యీ విశాల ప్రపంచంలో ఏకాకిగదా అని సానుభూతి విచారించాను. అంతకంటె నేనేమి చెయ్యగలను ?

మూడున్నర అవుతుంది. యిక మాట్లాడలేకపోతున్నాడు. అలసటగావున్నాడు.

"కాసేపు నిద్రపొండి" అన్నాను.

"ఇంక నిద్రపోతానుసీతా. నీలో అమరత్వంవుంది. నీ వాక్కులు అమృతతుల్యములు. నాజీవనజ్యోతి అమరజ్యోతిలో ఐక్యమైపోయే అదృష్టంపట్టింది.

అతనికి పావుగంటలో నిద్రపట్టింది. నే నింట్లోకివెళ్ళి అతనిగదిలోకివుండే తలుపు లోపలగడియ పెట్టుకున్నాను. యీ సంఘటనలన్నీ ఒకటిగా జ్ఞప్తికితెచ్చుకుంటూ సాయంకాలపువంటకి ప్రయత్నం చేసుకుంటున్నాను.

సాయంకాలం డాక్టరు పరీక్షించి గుండె చాలానీరసంగా వుందని అన్నాడు.

ఆ రాత్రి పన్నెండు గంటలకి "సీ—తా" అన్న పెద్ద పిలుపు అతిభీకరంగా వినిపించింది. ఆ పిలుపులో పూర్వపు మాదిరి మార్దవం లేదు. నేను హడలిపోతూలేచాను. ఆయన కంగారుపడుతూ లేచారు. నాగుండెలు దడదడ కొట్టుకున్నాయి ఎందుకో ?

నౌకర్ని శవందగ్గిర కాపలావుండమని యింటోకివస్తూ ఆయన అన్నారు: "నీకుచెప్పడం మర్చిపోయాను. అతని భార్య పేరు సీత. రామారావుకి రేపుడిసెంబరుకి యిరవైఅరు వెళ్తాయి."

"అలాగా?" అన్నాను.

మరింకేమంటాను?

(ఆగస్టు '38)